# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-02-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **దేశాన్ని వికసిత్ భారత్ వైపు నడిపించేలా కేంద్ర బడ్జెట్ ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.**

**2.** **పేదరిక నిర్మూలన, మౌలిక వసతుల కల్పనకు కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు.**

**3.** **రాబోయే రెండు మూడేళ్లలో దేశంలో 200 కొత్త వందేభారత్ రైళ్లను అందుబాటులోకి తీసుకురానున్నామని రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు.**

**4.** **గోదావరి-బనకచర్ల అనుసంధానంతో రాయలసీమలోని ప్రతి ఎకరానికీ నీరు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

**5.** **ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు.**

==========================

భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో కేంద్ర బడ్జెట్ ఒక ముఖ్యమైన మైలురాయి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఇది 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్ అని ఆయన తెలిపారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నిన్న లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ప్రజల్లో పొదుపు, పెట్టుబడులు పెరుగుతాయని ప్రధానమంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ బడ్జెట్ దేశాన్ని వికసిత్ భారత్ వైపు అడుగులు వేయిస్తుందని నరేంద్ర మోదీ వివరిస్తూ...

..వాయిస్..38 సెకన్లు

--------------------------

బడ్జెట్‌లో ఆదాయ పన్నుపై రిబేట్ పెంచడంతో కోటి మందికి పైగా ప్రజలకు ఊరట కల్పించామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బడ్జెట్ ప్రసంగం తర్వాత ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ..ఆదాయ పన్ను శ్లాబుల సవరణలతో ప్రజల చేతుల్లో సరిపడా నగదు ఉండేలా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. వ్యవసాయానికి విత్తనం నుంచి మార్కెట్ వరకు అన్నిరకాల మార్పులకు శ్రీకారం చుట్టామని తెలిపారు.

చిన్న, సన్నకారు రైతులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాన్ని మరింత మెరుగుపరిచామని నిర్మలా సీతారామన్ వివరిస్తూ...

.. వాయిస్.. 40 సెకన్లు

---------------------------

కేంద్ర బడ్జెట్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వాగతించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన మధ్యతరగతి ప్రజలకు పన్ను మినహాయింపు గొప్ప పరిణామమని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ వికసిత్ భారత్ దార్శనికతను బడ్జెట్ ప్రతిబింబిస్తోందన్నారు. ప్రజా అనుకూల ప్రగతిశీల బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారన్నారు. మహిళలు, పేదలు, యువత, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారన్న చంద్రబాబు నాయుడు.. రాబోయే ఐదేళ్లలో వృద్ధికి ఆరు కీలక రంగాలను బడ్జెట్ గుర్తించిందని తెలిపారు.

---------------------------

వికసిత్ భారత్ వైపు నడిపించేలా కేంద్ర బడ్జెట్ ఉందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రానికి అమూల్యమైన ప్రోత్సాహం ఇస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాజకీయ అవసరాలకంటే దేశం, ప్రజలు ముఖ్యం అనే సమున్నత దృక్పథం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కనిపించిందని చెప్పారు. 12 లక్షల రూపాయల వరకు వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయింపు ఊరట కలిగించే అంశమని.. ఈ తరహా సంస్కరణలు కచ్చితంగా మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేస్తాయని పవన్ కల్యాణ్ తెలిపారు.

---------------------------

కేంద్ర బడ్జెట్‌లో 12 లక్షల రూపాయల వరకు ఆదాయపన్ను మినహాయింపు ఇవ్వడం చరిత్రాత్మకమని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. బడ్జెట్‌పై ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కూటమి పార్టీల పార్లమెంట్ సభ్యులు ఢిల్లీలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ. ‘దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్’.. అన్న గురజాడ అప్పారావు మాటలను గుర్తుచేస్తూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించడం తెలుగువారందరికీ గర్వకారణమని తెలిపారు. ఈ బడ్జెట్ ద్వారా మధ్యతరగతికి మరింత ప్రయోజనం కలుగుతుందని రామ్మోహన్‌నాయుడు పేర్కొంటూ..

... వాయిస్... 40 సెకన్లు

---------------------------

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్.. మధ్య తరగతి ప్రజల కలల బడ్జెట్ అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ బడ్జెట్ ఎంతో ప్రత్యేకమైందని.. పేదరిక నిర్మూలన, మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులకు ఎంతో మేలు చేసే బడ్జెట్‌గా అభివర్ణించారు. ప్రభుత్వం ఆదాయం కోల్పోతున్నప్పటికీ ప్రజల శ్రేయస్సు కోసం 12 లక్షల రూపాయల వరకు ఆదాయపన్ను మినహాయింపు ఇస్తూ ఆర్థికమంత్రి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని కిషన్ రెడ్డి తెలిపారు.

---------------------------

రాబోయే రెండు మూడేళ్లలో దేశంలో 200 కొత్త వందేభారత్ రైళ్లను అందుబాటులోకి తీసుకురానున్నామని రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 2 లక్షల 52 వేల కోట్ల రూపాయలకు పైగా కేటాయింపులతో దేశవ్యాప్తంగా వేగవంతమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని మరింతగా విస్తరించేందుకు రైల్వే శాఖ సిద్ధమైందని తెలిపారు. వచ్చే రెండు మూడేళ్ల కాలంలో 200 కొత్త వందేభారత్ రైళ్లు, 100 అమృత్ భారత్, 50 నమో భారత్ ర్యాపిడ్ రైళ్లు, 17 వేల 500 జనరల్ నాన్ ఏసీ కోచ్‌లు రాబోతున్నాయని అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. కొత్త అమృత్ భారత్ రైళ్లతో తక్కువ దూరం ఉన్న నగరాలకు కనెక్టివిటీ మరింత పెరుగుతుందన్నారు.

---------------------------

గోదావరి–బనకచర్ల అనుసంధానంతో రాయలసీమలోని ప్రతి ఎకరానికీ నీరు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పేదల సేవలో.. కార్యక్రమంలో భాగంగా నిన్న ఆయన అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం సంబేపల్లె మండలంలో పర్యటించారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను స్వయంగా అందించారు. అనంతరం ప్రజావేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఉద్యాన, వ్యవసాయ రంగాలను మేళవిస్తామని తెలిపారు. 2047 నాటికి పేదరికం లేని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధనే తన లక్ష్యమని చంద్రబాబు నాయుడు తెలియజేస్తూ...

...వాయిస్.. 28 సెకన్లు

---------------------------

ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రోడ్లు, భవనాల శాఖలో ప్రతి విభాగం కీలకమేనని, అధికారులందరూ కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆ శాఖలో కొత్తగా చీఫ్ ఇంజనీర్లుగా నియమితులైన అధికారులతో హైదరాబాద్ లోని తన నివాసంలో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, టిమ్స్, నిమ్స్ భవనాల నిర్మాణంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి వారికి సూచించారు.

---------------------------

ఈరోజు ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పర్యావరణ సమతుల్యతను, జీవ వైవిధ్యాన్ని కాపాడడంలో చిత్తడి నేలలు పోషిస్తున్న పాత్రను తెలియచేయడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశ్యం. సముద్ర, నదీ తీర ప్రాంతాల్లో ఎల్లప్పుడూ లేదా ఏడాదిలో ఎక్కువ కాలం నీరు నిలిచి వుండే ప్రాంతాలనే చిత్తడి నేలలని అంటారు. ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు 1997 ఫిబ్రవరి 2వ తేదీ నుండి చిత్తడి నేలల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

=====================